క్లుప్తంగా

బేకరీ షాపు సీజ్

సీతంపేట: మండల కేంద్రంలోని ఓ బేకరీ షాపును బుధవారం రాత్రి సీజ్ చేసినట్లు తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. షాపు ఏర్పాటు చేసిన స్థలానికి సంబంధించి వివాదం కోర్టు పరిధిలో ఉందని పేర్కొన్నారు. ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని నోటీసులు జారీ చేసినా, నిబంధనలు అతిక్రమించి షాపు నిర్మాణం చేపట్టడంతో సీజ్ చేశామని చెప్పారు.

ఆయుర్వేదంపై అవగాహన

సీతంపేట: మండలంలోని దోనుబాయి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు కుశిమి పీహెచ్‌సీ ఆయుర్వేద డాక్టర్ రత్నం గురువారం ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి వైద్యం అందించవచ్చని, అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి భానుప్రతాప్, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను చేర్పించాలి..

భామిని: మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలోని బాలేరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రీస్కూల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు చదువు లభిస్తుందని చెప్పారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడిబోయిన చలపతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, శారద, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



గర్భిణితో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గర్భిణులకు పౌష్టికాహారం అందివ్వాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్యసేవలు, పౌష్టికాహారంపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ గర్భిణులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పరిశీలనలో ఏపీఓ చిన్నబాబు ఉన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన డీఈఓ



కురుపాం జెడ్పీహెచ్‌ఎస్‌లో టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతినాయుడు గురువారం సందర్శించారు. ఉదయం ప్రార్థన సమయానికే హాజరైన డీఈఓ విద్యార్థుల ప్రవర్తన తీరును పరిశీలించారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని శ్రద్ధగా చదువుకోవాలంటూ పలు మౌలిక ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలు, టీచింగ్ నోట్స్ పరిశీలించారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎంఈఓలు బి.చంద్రశేఖర్, ఎస్.సత్యనారాయణ, హెచ్‌ఎం టి.శంకరరావు ఉన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గరుగుబిల్లి: ప్రతీ ఒక్కరు కేన్సర్‌పై అవగాహన కలిగి వుండాలని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కీర్తి అన్నారు. గ్రామంలోని పలు వీధుల్లో కేన్సర్‌పై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వై జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం నుంచి 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కేన్సర్ రోగంతో ఏ ఒక్కరు మరణించకూడదనే ధ్యేయంతో ప్రభుత్వం ప్రతీ ఒక్కరికీ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈ ఒ.సూర్యప్రకాష్, హెచ్‌వీ సన్యాసమ్మ, గోపి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భామిని: మండల కేంద్రంలోని 11 కేవీ విద్యుత్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు మండల కేంద్రంలో సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



చలికాలం.. జరభద్రం



ఆస్పత్రికి వస్తున్న వృద్ధులు

- ప్రారంభమైన శీతల గాలులు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- అజాగ్రత్తగా ఉంటే ప్రాణాంతక సమస్యలు

పాలకొండ రూరల్:

ఏజెన్సీ కలబోసి ఉన్న నియోజకవర్గంలో చలిగాలులు ప్రారంభమయ్యాయి. ఏజెన్సీ ప్రాంతంలో చల్లదనం, పొగమంచు ఉదయం మూడు గంటల నుంచి ఏడు గంటల వరకు ఉంటోంది. ఇదే వాతావరణంలో సాయంత్రం ఆరు గంటల నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. ఈ శీతలం చాటున అనారోగ్య కారకాలు, వివిధ రకాల వైరస్‌లు దాగి ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మరోవైపు చలి నుంచి రక్షించుకునేందుకు స్వెట్టర్లు, చేతులకు గ్లౌజులు, ముఖానికి మంకీ క్యాప్‌లు ఉపయోగించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో...

జలుబు, దగ్గు, చలి జ్వరం, గొంతు నొప్పివంటి రుగ్మతులు అధికం కాకముందే ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులు వాడుకోవాలి. చిన్నారులు, గుండె, డయాబెటిక్ బాధితులు, వ్యాధి నిరోధక శక్తి తక్కుగా ఉన్నవారికి ఈ సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా ఆశిస్తాయి. న్యూమోనియా, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకునే అవకాశాలున్నాయి. ప్రస్తుత సీజన్‌లో వచ్చే ఏ చిన్న సమస్యనైనా అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం. ముఖ్యంగా ఈ కాలంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఇన్‌ఫెక్షన్స్ వేగంగా సోకే ప్రమాదం ఉంది. వైరల్ ఇన్‌ఫెక్షన్స్, స్వైన్ ఫ్లూ లాంటి ప్రాణాపాయ వ్యాధుల నుంచి రక్షించునేందుకు శరీరానికి వేడినిచ్చే ఆహారపదార్థాలను ఆరగించాలి. గుమ్మడి, బొప్పాయి, ఆరెంజ్, పసుపు రంగుతో కూడిన ఆహారాలు వాడడం శ్రేయస్కరం.

జాగ్రత్తలు పాటించాలి..



ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పిల్లలు, పెద్దలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికం. ప్రధానంగా ఆస్తమా ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలి. రోజులో కనీసం 20 నిమిషాల పాటు ఉదయం, సాయింత్రం శరీరంపై సూర్యకాంతి పడేలా చూసుకోవాలి. తీసుకునే ఆహారంలో పీచుపదార్థాలు ఉండేలా చూడాలి. తప్పనిసరిగా తృణధాన్యాలు తీసుకోవాలి. పిల్లలకు కోడిగుడ్లు, విటమిన్-డి అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఇవ్వాలి. అప్పుడే శరీరంలో ఉష్ణోగ్రతల సమతుల్యత ఉంటుంది. మధుమేహం, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు, వృద్ధులు వైద్యుల సూచనలు పాటించాలి. ముఖ్యంగా వ్యక్తిగత, పరిశరాల పరిశుభ్రత అవసరం.

– డాక్టర్ జి.నాగభూషణరావు, ఏరియా ఆస్పత్రి, సూపరింటిండెంట్, పాలకొండ

జాగ్రత్తలు ఇలా...

- శీతాకాలంలో చర్మం పొడి బారిపోకుండా ఔషధ పూరిత లేపనాలు వాడుకోవాలి.
- రసాయనాలతో కూడిన సబ్బులకు బదులు మైల్డ్ సోప్స్ వాడడం మంచిది.
- గోరువెచ్చని నీటితో స్నానం చేయడం ఆరోగ్యకరం.
- చేతులు, కాళ్లు ఈ కాలంలో పగిలే అవకాశాలు అధికం. దీనిని అధిగమించేందుకు వైద్యులు సూచించిన క్రీములు వాడాలి.
- ప్రస్తుత సీజన్‌లో అధికంగా పండ్ల రసాలు, పండ్లను స్వీకరించడం మంచిది.
- చలిగాలుల కారణంగా చర్మ సంబంధిత, ఆస్తమా, గుండె జబ్బులు, చెవి, ముక్కు, గొంతు నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది.
- ముఖ్యంగా చిన్న పిల్లల్లో చెవిపోటు, గొంతు నొప్పి, జలుబు వచ్చే అవకాశం ఉన్నందున సూర్యరశ్మి వచ్చిన తర్వాత వారిని బయటకు పంపడం మేలు.
- రోజూ మూడు నుంచి తొమ్మిది గ్లాసుల నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి.
- వాకింగ్‌కు వెళ్లేటప్పుడు శరీరంపై అధిక ఒత్తిడిని కలిగించే వ్యాయామాలకు బదులు తేలికపాటి వ్యాయామాలను చేయాలి. అలా చేస్తే శరీరంలో వేడి పుట్టి చలిని తట్టుకునే శక్తి వస్తుంది.
- పొగ తాగేవారు చలిలో వాకింగ్ చేస్తే రక్తనాళాలు సంకోచిస్తాయి. అలాగే బీపీ, సుగర్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలి.
- ఆస్తమా, శ్వాశ సంబంధిత సమస్యలున్న వారు మంచులో నడిచే సమయంలో జాగ్రత్తలు పాటించాలి.
- చక్కెర వ్యాధిగ్రస్తులు వ్యాయామం చేసే సమయంలో తీపి పదార్థాలు అందుబాట్లో ఉంచుకోవాలి.
- ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇన్‌హేలర్ వాడేందుకు బదులు ఉదయం, సాయంత్రం వేళల్లో వేడి నీటి ఆవిరి పట్టడం మంచిది.



పాలకొండ పరిసరాల్లో వేకువజామున కురుస్తున్న మంచు

సకాలంలో గృహ నిర్మాణాలు చేపట్టండి..

- ఏఈ మాధవరావు

పాలకొండ రూరల్: ప్రభుత్వం అందించిన స్థలాల్లో గృహనిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత శాఖ ఏఈ మాధవరావు అన్నారు. పాలకొండ అర్బన్ పరిధి లుంబూరు సమీపంలో పేదలకు అందించిన ఇళ్ల స్థలాలు, అక్కడ జరుగుతున్న నిర్మాణాల తాజా స్థితిగతులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ నెలాఖరు నాటికి స్థలాలు పొందిన ప్రతిఒక్కరూ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వపరంగా అందించాల్సిన బిల్లులతో పాటు సిమెంట్, ఇసుకను అందించేందుకు శాఖాపరంగా సిద్ధంగా ఉన్నామన్నారు.



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ మాధవరావు

విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): గిరిజన విద్యా సంస్థల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు టి.జీవన్, కుండంగి లింగరాజు, గరుగుబిల్లి సూరయ్య, పువ్వల ప్రసాద్ డిమాండ్ చేశారు. జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను, కురుపాం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం వారు సందర్శించారు. రెండు పాఠశాలలకు చెందిన ఒక్కో విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరా తీసారు. అనంతరం కురుపాంలో విలేకర్లతో మాట్లాడారు. బుధవారం మృతి చెందిన ఇద్దరు విద్యార్థులను కలుపుకొని 12 మంది వరకు విద్యార్థులు మృతి చెందారని, అయినప్పటికీ ప్రభుత్వంగానీ, జిల్లా అధికారులుగానీ స్పందించకపోవడం దారుణమన్నారు. వందల మంది విద్యార్థులతో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో యోగక్షేమాలు, ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు ఆరోగ్య కార్యకర్తనైనా నియమించకపోవడం బాధాకరమని, గిరిజన విద్యార్థులంటే ప్రభుత్వానికి అంత చులకనయ్యారా! అంటూ ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు

ఎర్రకంకి తెగులుపై అప్రమత్తం

వీరఘట్టం: మండలంలోని సంత – నర్సిపురంలో వరి పంటకు ఎర్రకంకి తెగులు సోకడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్ పాల్ సంత – నర్సిపురం గ్రామానికి గురువారం చేరుకుని ఎర్రకంకి ఆశించిన ఎంటీయూ 1318 రకం వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, తెగులు ఆశించిన చేనులో పంటకోత ప్రయోగాలు చేపట్టి, పంట నష్టాన్ని అంచనా వేస్తామన్నారు. గ్రామంలో సుమారు 120 ఎకరాల్లో వరి పంటకు ఎర్రకంకి సోకినట్లు గుర్తించామని తెలిపారు. ఆయనతో పాటు ఏడీఏ రత్నకుమారి, వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య ఉన్నారు.

రూ. 15 లక్షల పరిహారం ఇవ్వాలి..

సీతంపేట: ప్రభుత్వ వైఫల్యం వల్లే గిరిజన విద్యార్థులు మృతి చెందారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరంగి గోపినాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గేదెల చందు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రతీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంలను నియమిస్తామని గిరిజన మంత్రి హామీ ఇచ్చినప్పటికీ, ఇంతవరకు నెరవేర్చలేదని పేర్కొన్నారు. రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల అధికారులు

భామిని: నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు మండల అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, భామిని మండలంలో 25 నీటి సంఘాల పరిధిలో సాగునీటిని వినియోగించే రైతుల పేర్లను ఓటర్లుగా గుర్తించి జాబితాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ నెల పదో తేదీన పంచాయతీ కార్యాలయాల్లో జాబితాలు ప్రచురించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ గుండేలా చంద్రరావు, ఇరిగేషన్ ఏఈ ఆర్.మధు, ఎంఈఓ వి.భాస్కరరావు, ఆర్ఐ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి పూజలు

సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామికి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, తులసి దళాలతో తయారుచేసిన మాలలు వేసి పూజలు గావించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

సీతానగరం: మండల కేంద్రంలో గురువారం కేన్సర్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ పావని ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు ఆధారిత ఉత్పత్తుల వల్ల కేన్సర్ సంక్రమిస్తుందన్నారు. సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. బగ్గందొరవలసలో పీహెచ్‌ఎన్ సత్యవతి ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ ఐ.హరికృష్ణ, ఏఎన్‌ఎం, సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో పీఓ రాత్రిబస

సీతంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీఓ గురువారం రాత్రిబస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. అనంతరం ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర ఉన్నారు.



సీతంపేట: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ఆశ్రమ పాఠశాలలో..

కొమరాడ: మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల పాఠశాల(బాలురు)లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్ గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీసారు. అనంతరం మరుగుదొడ్లు, స్నానపు గదులతో పాటు బెడ్ రూమ్స్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉంది? సమయపాలన పాటిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. మెను కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంఈడీఓ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కొమరాడ: వసతిగృహాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్

వితరణ..

శ్రీరామగిరి క్షేత్రంలో సుమారు 400 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దివంగత జగద్గురు పార్వతీకుమార్ 80వ జయంతిని పురస్కరించుకుని వనవాసీ శ్రేయో సంస్థ ప్రతినిధులు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి వనవాసీ శ్రేయో సంస్థ అధ్యక్షుడు పెంటయ్య మాస్టారు, విశ్రాంత ఆదాయ పన్ను కమిషనర్ సిరి, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

– సీతంపేట



పరామర్శ..

ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందిన తూడి గ్రామానికి చెందిన కొనిసి శివకుమార్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం పరామర్శించారు. మృతుడి తండ్రి అప్పలనాయుడుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పరామర్శలో కళావతితో పాటు సర్పంచ్ కె.వెంకటరమణమూర్తి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి ఉన్నారు.

– వీరఘట్టం



వసతిగృహ సందర్శన

గరుగుబిల్లి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు గురువారం రాత్రి సందర్శించారు. వసతిగృహంలో అమలవుతున్న మెనూను పరిశీలించారు. విద్యార్థులకు తగిన సదుపాయాలు ఉన్నదీ... లేనిదీ.. ఆరా తీశారు. పల్లె నిద్రలో భాగంగా రాత్రి వసతిగృహంలో నిద్రించి ఉదయం గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకోనున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ కె.హిందుమతి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు ఉన్నారు.

– గరుగుబిల్లి



పంపిణీ ..

దారిమల్లి గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి గురువారం సవర భాషా పుస్తకాలు పంపిణీ చేశారు. భాషపై పట్టు సాధించేందుకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పీఓ తెలిపారు. భాషా వలంటీర్లు విద్యార్థులు అర్థమయ్యేరీతిలో బోధించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ పి.నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రామలమ్మ, సీఎంఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

– సీతంపేట



ప్రభుత్వ వైఫల్యంతోనే గిరిజన విద్యార్థుల మృతి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ మృతి ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందని, ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు.

కురుపాం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఎం.శ్రీనివాసరావు, వి.వాసు, అడ్డమేశ్వరరావుతో కలిసి విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. ఈ ఏడాది ఇప్పటికి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేసారు ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లేక్కలేదా... అని ప్రశ్నించారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు

సమగ్ర దర్యాప్తు జరపాలి

జియ్యమ్మవలస: గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి గంగునాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాలకు వెళ్లి గిరిజన విద్యార్థి మృతిపై గురువారం ఆరా తీశారు.

మూడు పూటలా భోజనం ..!

- ఎంపీడీఓ వెంకటరమణ హామీ

వీరఘట్టం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహ విద్యార్థులకు మూడు పూటలా భోజనం సదుపాయం వసతిగృహంలో కల్పించేలా చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ బి. వెంకటరమణ అన్నారు. గురువారం రాత్రి ఆయన వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో 16 మంది విద్యార్థులుండగా.. అందరూ సమీపంలోని ఆర్‌సీఎం పాఠశాలలో చదువుతున్నారు. అయితే ఆర్‌సీఎం ప్రైవేట్ పాఠశాల కావడంతో అక్కడ మధ్యాహ్న భోజనం పథకం అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులందరూ మళ్లీ వసతిగృహానికి వచ్చి భోజనం చేస్తున్నారు. వాస్తవానికి వసతిగృహ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే మధ్యాహ్న భోజనం అక్కడే చేస్తారు. కాని ఆర్‌సీఎంలో మధ్యాహ్న భోజనం లేకపోవడంతో విద్యార్థులు వసతిగృహానికి రావాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే ప్రభుత్వం వసతిగృహానికి రెండు పూటలకు సరిపడా సరుకులు ఇస్తోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వార్డెన్ ఆ సరుకులనే మూడు పూటలా సర్దుతున్నారు. ఈ విషయం విద్యార్థుల ద్వారా తెలుసుకున్న ఎంపీడీఓ వెంకటరమణ కలెక్టర్‌తో మాట్లాడి మూడుపూటలా భోజనం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ